క్లుప్తంగా

పండితులకు ఉగాది పురస్కారం



పురస్కారాలు అందుకున్న అర్చకులు

గార: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీకూర్మనాథాలయ అర్చకులకు ఉగాది పురస్కారాలు అందజేసింది. అర్చకులు గోపినంబాళ్ల నల్లకూర్మనాచార్యులు, సీఎస్ కృష్ణమాచార్యులకు పురస్కారాన్ని ఈవో జి.గురునాథం బుధవారం అందజేశారు. ప్రతీ ఏడాది కొందరు అర్చకులకు పురస్కారాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, అనుపోజు నాగరాజు, పొన్నాడ రుషి, పూడి కమల, నర్సుబాబు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ పార్కు నిర్మాణం



నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో వైఎస్సార్ పార్కు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పార్క్ నిర్మాణం చేపడుతున్నారు. పార్కు పనులు పూర్తయితే విశ్రాంతి తీసుకోవడానికి, వ్యాయామం చేసుకోవడానికి బాగుంటుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులను గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కింతలమిల్లు జంక్షన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఊపిరి పీల్చుకున్న మొక్కజొన్న రైతులు



జి.సిగడాం: మొక్కజొన్న పంటను యంత్రాలతో ఆడుతున్న రైతులు

జి.సిగడాం: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కండెలు తడిచిపోవడంతో నష్టపోయే పరిస్థితి నెలకొంది. అయితే బుధవారం ఎండ ఎక్కడంతో ఊపిరిపీల్చుకున్నారు. కండేలను ఆరవేశారు. కొంతమంది యంత్రం సాయంతో కండెల నుంచి జొన్నలను వేరుచేసి ఆరవేశారు.

పీహెచ్‌సీకి నూతన భవనాలు



నూతనంగా నిర్మిస్తున్న భవనాలు

లావేరు: మండల కేంద్రం లావేరు గ్రామంలోని 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీకి నూతన భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకూ ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాల్లో పీహెచ్‌సీని నడపరాదని ఇంజినీరింగ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా నూతన భవనాల నిర్మాణాల కోసం రూ.1.77 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను కూల్చివేసి.. అదే స్థలంలో నూతన భవనాలను నిర్మిస్తున్నారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో వీటిని ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తేజేశ్వరరావు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పాతపట్నం నియోజకవర్గం నాయకుడు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి అనేక అవసరాల కోసం వచ్చిన ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగిస్తామన్నారు. చలివేంద్రం వద్ద ప్రతీరోజు ఒక వ్యక్తి ఉంటారన్నారు.

ఆధ్యాత్మిక ‘శోభ’కృత్

పల్లెలు..పట్టణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శోభకృత్ నామ ఉగాది వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. పురోహితుల పంచాంగ శ్రవణాలతో ఊరూరు సందడిగా కనిపించింది. తమ రాశి ఫలాలు ఈ ఏడాది ఎలా ఉంటాయో తెలుసుకోవడానికి ఉత్సుకత చూపారు. ఉగాది పచ్చడిని సంతృప్తిగా ఆరగించి ఆనందం పొందారు. రైతులు ఏరువాకను ప్రారంభించి పంటలు బాగా పండాలని భూమాతకు మొక్కుకున్నారు.

- ఘనంగా ఉగాది వేడుకలు
- ఊరూరా పంచాగ శ్రవణాలు



శ్రీకాకుళం కల్చరల్: శివబాలాజీ ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: గిరిజా ముక్కంటేశ్వర ఆలయంలో చిన్నారుల నృత్యాలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటేశ్వర ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో విద్యార్థినులు ఉగాది వేడుకలను జరుపుకున్నారు. రంగులు పూసుకోని ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లో ఏరువాక, వ్యవసాయ పనులు ప్రారంభించారు.

శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ పఠనాన్ని తెన్నేటి సునీల్ శర్మ చేశారు. అలాగే దేవాలయంలో ఉన్న క్షిప్రగణపతికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు జి.తులసీరావు, ఎంసీహెచ్ సామంత్, ఆర్‌వీఎన్ శర్మ, బి.వి.ఎస్.ఎన్.రెడ్డి, కైలాసరావు, వైకుంఠరావు, రమేష్, రాంబాబు రెడ్డి, ప్రసాదరావు, వట్టి బాబూరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం పంచాయతీ రామజోగిపేటలో ఉగాది సందర్భంగా రామ మందిరంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రి మహోత్సవం, పందిరి రాట కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తెన్నేటి విక్రమశర్మ పంచాంగ శ్రవణం చేశారు. గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలో శోభకృత్ నామ ఉగాది వేడుకలు వేడుకగా జరిగాయి. ఉదయాన్నే లేచి గ్రామాల్లో చిన్న, పెద్ద అందరూ నూతన దుస్తులు ధరించి మామిడితోరణాలతో ఇళ్లను అలంకరించారు. ప్రతి ఇంటిలోనే షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసుకొని ఆరగించారు. పురోహితులు రామాలయాలు, రచ్చబండల వద్ద పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. పశువులను శుభ్రంగా కడిగి కొత్త నాగలి, కొత్త పలుపులు, తాళ్లు వంటివి సిద్ధం చేసి వేకువజామున పొలాలకు వెళ్లి ఏరువాక ప్రారంభించారు.

జి.సిగడాం: మండలంలో ఉగాదిని ప్రజలు సందడిగా జరుపుకున్నారు. గ్రామాల్లో పంచాగ శ్రవణాలు జరిగాయి. రైతులు వేకువజామునే కొత్త నాగళ్లతో ఏరువాక సాగించారు. ఆలయాల్లో పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులతో పిల్లలు..పెద్దలు ఆకట్టుకున్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది సందర్భంగా స్వామికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చక్కగా అలంకరించారు.

- బలగ బాలత్రిపుర కాలభైర పీఠం దేవాలయంలో పీఠం గురువు గణేష్ పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉగాది నుంచి లలితాదేవి నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- బలగ అయ్యప్ప దేవాలయంలో ఉగాది సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.
- పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతికి సహస్ర దీపాల అలంరణ చేశారు. ఉగాది సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అధికంగా వచ్చి దర్శించుకొని పూజలు చేశారు.
- గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలచే సామూహిక సుహాసినీ పూజలు చేసారు.



జి.సిగడాం: నాగువలసలో సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు



బలగ పీఠంలో పంచాంగ శ్రవణం



లావేరు: సూర్యనారాయణపురంలో పంచాంగ శ్రవణంలో రైతులు, గ్రామస్తులు



నక్కవీధి ఉమాజఠలేశ్వరుని అలంకరణ



విజయగణపతికి సహస్ర దీపాలసేవ



పార్వతీదేవికి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ఉపనిషన్మందిరంలో రామోత్సవాలు ప్రారంభం



శంకరనారాయణశర్మను సత్కరిస్తున్న దృశ్యం



ఉపనిషన్మందిరంలో సత్కారం అందుకుంటున్న విక్రమశర్మ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు, శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెన్నేటి విక్రమశర్మ పంచాంగ శ్రవణం చేసి సంవత్సర శుభాశుభ ఫలితాలు తెలియజేశారు. తొలుత వేదపఠనం జరిగింది. ఈ సందర్భంగా విక్రమశర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు వి.కామేశ్వరరావు, నిష్టల నర్సింహమూర్తి, ససపల నారాయణమూర్తి, కోదండ రామాలయ అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు.

గుజరాతీపేటలో..

గుజరాతీపేట బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి మాట్లాడుతూ.. బ్రాహ్మణులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. అనంతరం ఉగాది పురస్కారాల సత్కారాలలో భాగంగా సంగీత విద్వాంసులు సుసరాపు లక్ష్మీగణపతిశర్మ, అయ్యప్పదేవాలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ, మేడూరు భాస్కరశర్మలను సత్కరించారు. అనంతరం కవితా గోష్ఠి జరిగింది. ఆరవెల్లి ఫణీంద్రశర్మ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దూసి నాగేశ్వరరావు, పెంట సూర్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

28 నుంచి హాటకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో వెలసిన హాటకేశ్వరస్వామి కల్యాణ యాత్ర మహోత్సవాలు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ ప్రధాన అర్చకులు పెంట రామక్రిష్ణశర్మ, చిట్టిబాబు శర్మలతో కలిసి కార్యనిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 28న ధ్వజారోహణం, ఏప్రిల్ ఒకటో తేదీన స్వామివారి కల్యాణం, మూడున సదస్యోత్యవం, ఐదున దాపోత్సవం, ఆరున వసంతోత్సవం, ఏడున శక్తి ఉత్సవంతో ఉత్సవాలు ముగిస్తాయని వివరించారు. సదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తొలుత ఉగాది సందర్భంగా పంచాంగం శ్రవణం, రాశీ ఫలాలను పురోహితులు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు నక్క శంకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహాగళార్చన



కోలాటమాడుతున్న చిన్నారులు



మహాగళార్చనలో పాల్గొన్న భజగోవిందం సభ్యులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో ఉగాది సందర్భంగా భజగోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన గోవింద నామాల మహాగళార్చన ఆకట్టుకుంది. వందలాది మంది భజగోవిందం సభ్యులు పాల్గొని సామూహికంగా గోవింద నామాలు పలికారు. గంట కాలం కొనసాగిన గోవిందనామాల గళార్చనతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. అనంతరం జోష్యుల సుందర వేణుగోపాలశర్మ పంచాంగ శ్రావణం నిర్వహించారు. భజగోవిందం సేవా సమితి సభ్యులు గొండు స్వామిబాబు, శిమ్మ లక్ష్మణరావు, గుంటక శ్రీధరరావు, ఉప్పాడ వెంకటరావు, సంతోషి తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనరసింహ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. రామావతారంలో వేంకటేశ్వర స్వామి దర్శనం ఇచ్చారు.

అలరించిన హరేరామ నామ సంకీర్తన



హరేరామ నామ సంకీర్తన చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో హరేరామ నామ సంకీర్తన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో 24 గంటల పాటు హరేరామ, హరేకృష్ణ నామ సంకీర్తన నిర్వహించామని కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భజన మండల సభ్యులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

హిరమండలం: స్థానిక కోదండరామాలయలంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది నుంచి ఈ నెల 30 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30న సీతారాముల కల్యాణం మహోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేరోజు అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

భారీ వర్షం

కొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఐదు నుంచి ఏడు గంట వరకు భారీ వర్షం కురిసింది. నాలుగు రోడ్ల కూడలి వర్షం నీటితో నిండిపోయింది. కొంత సమయం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు టమాటా, నువ్వు పంటలతోపాటు పలు రకాల పంటలకు నష్టం జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

పాతపట్నం: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలు, పిడుగులతో కూడిన భారీ వర్షం గంట సమయం కురిసింది. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, రొంపివలస, గంగువాడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

వృద్ధులు, చిన్నారులకు దుస్తులు పంపిణీ



దుస్తులతో ఉన్న కిట్లతో చిన్నారులు, వృద్ధులు

శ్రీకాకుళం కల్చరల్: వయోవృద్ధులు, చిన్నారులకు అండగా ఉంటానని ఐతం కళాశాల చైర్మన్, ప్రముఖ శిశువైద్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా భాగ్యలక్ష్మీ సోమేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలోని చిన్నారులకు, వృద్ధులకు దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త దుస్తులు వేసుకోవాలని పిల్లలు భావిస్తుంటారని అందువలనే ఏటా ఉగాది రోజున అనురాగనిలయంలోని చిన్నారులకు దుస్తులు అందజేస్తున్నట్టు చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా చిన్నపిల్లల వైద్య నిపుణిడిగా సేవలు అందించిన సోమేశ్వరరావు రోటరీ ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ రవికుమార్, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, వి.సుధాప్రియ, కె.వనజ, కె.రేవంత్, కె.వైష్ణవి, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గనవర్నర్ కొంక్యాన మురళీధర్, అనురాగ నిలయం ఇన్‌చార్జి సాయి సుధాకర్, వసతి గృహ నిర్వాహకులు ప్రకాష్, సంగమేశ్వర్, జర్నలిస్టు కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సరిగమపదనిస సుస్వరాల ఎంపిక



గీతాలను ఆలపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో సరిగమపదనిస సుస్వరాల ఎంపిక కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ (ఎంసీఏ) అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో 45 మంది గాయనీ గాయకులు స్వరాలను ఆలపించారు. కార్యక్రమంలో పద్మశ్రీ తమిల్ వెర్షనర్ ట్రైలర్‌ను విద్యావేత్త బలివాడ మల్లేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం దుష్ట చతుష్టయం అల్లాహో ఆల్బమ్స్ షార్ట్ ఫిలిమ్స్ ట్రైలర్స్ రిలీజ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్.ఎస్.పట్నాయక్, బాసంగి సురేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన పాత్రుని పాపారావు, జె.కె.వెంటేశ్వరరావు, దుంపల ఈశ్వరరావు, పెంకి నాగేశ్వరరావు, కె.వెంకటరమణయ్యలను సత్కరించారు. గాయకులకు ఉదయభాస్కర్ ఉగాది పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో ఎంసీఏ సభ్యులు రామకృష్ణ, రాము, మైలపల్లి రామరావు, శ్రావణి పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: జాతీయ రహదారికి అనుకుని కల్యాణి డాబా ఎదురుగా ఉన్న శ్మశానానికి రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న ఈ పనులను బుధవారం ప్రారంభించారు. పెద్దపేట, జగన్నాథపురం, మారుతీనగర్ నెయ్యిల, కిలిగి, బండివీధి, సౌభాగ్యలక్ష్మీనగర్, శ్రీరామనగర్‌లకు చెందిన శ్మశానానికి సరైన రోడ్డు లేక వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు పి.కృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాగోటి రాజారావు, ముద్దాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గిరిజనులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న హేమలత

సారవకోట: తమ హక్కుల సాధనకు గిరిజనులందరూ సంఘటితం కావాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.హేమలత అన్నారు. మండల కేంద్రంలో గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించేందుకు కలిసి పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ట్రైకార్ రుణాలు మంజూరు చేయడం లేదని, వాటిని మంజూరు చేయాలన్నారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి గుజ్జువాడ సోమేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, జన్ని రామారావు, బెల్లికొల దండాశి, మెండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.